రాష్ట్రంలో ప్రతిపక్షాలకు స్థానం లేదు



హయత్‌నగర్‌లో పార్టీలో చేరిన వారితో సుధీర్‌రెడ్డి

బీఆర్ఎస్ ఎల్బీనగర్ అభ్యర్థి సుధీర్‌రెడ్డి

లింగోజిగూడ: రాష్ట్రంలో ప్రతిపక్షాలకు స్థానం లేదని, మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ఎల్‌బీ నగర్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హయత్‌నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీలకు చెందిన యువకులు, మహిళలు సుమారు 100 మంది శ్రీకాంత్ ఆధ్వర్యంలో సుధీర్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు.

ఈ సందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, ఇతర పార్టీలు ఇస్తున్న మోస పూరిత హామీలు నమ్మి మోస పోవద్దని, సంక్షేమం, అభివృద్ధికి ప్రజలు పట్టం కట్టాలని పిలుపు నిచ్చారు. కారు గుర్తుకు ఓటు వేసి ముచ్చటగా మూడోసారి బీఆర్ఎస్ ప్రభుత్వానికి అధికారం ఇవ్వాలని కోరారు. నియోజకవర్గాన్ని ఇప్పటికే అగ్రస్థానంలో ఉంచానని, మరింత అభివృద్ధి చేసేందుకు తోడ్పాటు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సామ తిరుమల్‌రెడ్డి, నాయకులు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, భాస్కర్‌సాగర్, మల్లేష్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో మొబైల్ కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా..

ఆటో మొబైల్ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎల్‌బీనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం చింతలకుంటలో జరిగిన ఎల్‌బీ నగర్ టూ వీలర్ మెకానిక్ అసోసియేషన్, ఆటో మొబైల్స్ సంక్షేమ సంఘం ఆత్మీయ సమ్మేళనంలో సుధీర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మికులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. తమ కార్మికుల పూర్తి మద్దతు బీఆర్ఎస్‌కే ఉంటుందని తెలిపారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, అన్ని వర్గాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, కార్మికులు సమావేశం ఏర్పాటు చేసుకొనేందుకు స్థలం కేటాయిస్తామని అన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు అశోక్‌కుమార్, నరేందర్‌యాదవ్, జగన్‌గౌడ్, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఇక రోడ్‌షోలు.. ప్రచార సభలు

ఎల్బీనగర్‌లో అగ్రనాయకులతో ప్రచారానికి ప్రధాన పార్టీల సన్నాహాలు

- రెండో దఫా ప్రచారంపై దృష్టి పెట్టిన బీఆర్ఎస్
- బీజేపీ విజయం కోసం శ్రమిస్తున్న కార్పొరేటర్లు
- బీసీ ఓటు బ్యాంక్‌పై కాంగ్రెస్ ఆశలు

ఎల్‌బీనగర్: ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ప్రధాన పార్టీల అభ్యర్థులు ప్రచారంపై దృష్టి సారించారు. ప్రధాన నాయకులను రోడ్‌షోలు, సభలకు ఆహ్వానించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పోలింగ్ సమయం సమీస్తుండంతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. మరోసారి పాగా వేసేందుకు అధికార పార్టీ, ఎలాగైన విజయం సాధించాలని కాంగ్రెస్, బీజేపీలు ఎత్తులు వేస్తున్నాయి.

రెండో దఫాకు బీఆర్ఎస్ వ్యూహాలు

ఇప్పటికే ఒక దఫా ప్రచారం పూర్తి చేసిన అధికార బీఆర్ఎస్ పార్టీ రెండో దఫాకు వ్యూహాలు రచిస్తోంది. మంత్రి కేటీఆర్‌తో పాటు సీఎం కేసీఆర్‌తో భారీ బహిరంగ సభ, రోడ్‌షోలు నిర్వహించాలని ఆపార్టీ అభ్యర్థి సుధీర్‌రెడ్డి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే కేటీఆర్‌తో బూత్ లెవల్ సమావేశాలు నిర్వహించారు. ఇక రోడ్‌షోలకు భారీగా జనం తరలించేందుకు నాయకులతో మంతనాలు జరుపుతున్నారు.

అగ్రనేతలతో ప్రచారానికి బీజేపీ ప్రణాళికలు:

ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో పోటీ చేస్తున్న బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డి ఈసారి ఎలాగైనా విజయం సాధించాలనే పట్టుదలతో ముందుకు సాగుతున్నారు. గత ఐదేళ్లుగా నియోజకవర్గంలోని పలు సమస్యలను అధికారుల దృష్టికి తేవడంతో గతంలో జరిగిన జీహెచ్ఎంసీ ఎన్నికల్లో 11 డివిజన్లను దక్కించుకున్నారు. తర్వాత జరిగిన పరిణామాలు, కరోనాతో లింగోజిగూడ కార్పొరేటర్ ఆకుల రమేష్‌గౌడ్ మృతితో ఏర్పడిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి విజయం సాధించారు. దీంతో బీజేపీకి 10 మంది కార్పొరేటర్లు ఉన్నారు. వీరందరూ డివిజన్లలో పర్యటిస్తూ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయం కోసం శ్రమిస్తున్నారు. ఎలాగైనా ఎల్బీనగర్‌లో బీజేపీ జెండా ఎగురవేయాలనే లక్ష్యంతో ఇక్కడ ప్రచారానికి అగ్రనేతల సమావేశాల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

కాంగ్రెస్ ప్రత్యేక కార్యాచరణ..

హస్తం పార్టీ ప్రత్యేక కార్యాచరణతో ప్రజల్లోకి వెళ్తోంది. ప్రభుత్వ వ్యతిరేక ఓట్లను కొల్లగొట్టేందుకు చూస్తోంది. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతూ తామే ప్రధాన పోటీదారులమని కాంగ్రెస్ నాయకులు ప్రచారం చేస్తున్నారు. పోటీలో ఉన్న మధుయాష్కీ గౌడ్ బీసీ నాయకుడు కావడం, ఈ నియోజకవర్గంలో బలమైన బీసీ ఓట్ బ్యాంకు ఉండటంతో వారిని తమ వైపు తిప్పుకుని ఓటింగ్ చేయించుకుంటే విజయం తమనే వరిస్తుందనే ధీమాలో కాంగ్రెస్ నాయకులు ఉన్నారు. పార్టీ అగ్రనేత రాహుల్‌తోపాటు ఇతర నాయకులు ఇక్కడ రోడ్‌షోలు నిర్వహించనున్నట్లు తెలిసింది.

జంగ్ తెలంగాణ 2023

అవకాశం ఇవ్వండి..అభివృద్ధి చేసి చూపిస్తా

మలక్‌పేట బీజేపీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి



మూసారంబాగ్‌లో ప్రచారం చేస్తున్న సురేందర్‌రెడ్డి

మలక్‌పేట: ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని, మలక్‌పేటను అభివృద్ధి చేసి చూపిస్తానని బీజేపీ అభ్యర్థి సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సంజీవయ్యనగర్, బ్యాండ్‌బస్తీ, కట్టెలమండి, తీగలగూడ, రామాలయం, కృష్ణతులసి నగర్ ప్రాంతాల్లో పార్టీ నాయకులతో కలిసి పాదయాత్ర చేస్తూ ఓట్లు అభ్యర్థించారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్, ప్రధాన కార్యదర్శి సండడి సురేందర్‌రెడ్డి, కోశాధికారి రమేష్‌రెడ్డి, నాయకులు సురేందర్, గౌర విజయ్‌కాంత్, దినేష్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

మన్సూరాబాద్: వైఎస్సార్ తెలంగాణ నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు గౌని నర్సింహగౌడ్, రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి కోట్ల వాసు తమ పదవులకు, పార్టీకి రాజీనామా చేశారు. మన్సూరాబాద్ ఎస్కే గార్డెన్స్‌లో జరిగిన కార్యక్రమంలో ఎల్‌బీనగర్ కాంగ్రెస్ అభ్యర్థి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. టీపీసీసీ నేత జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, నాయకులు బుడ్డ సత్యనారాయణ, జక్కిడి శివచరణ్‌రెడ్డి పాల్గొన్నారు.

బరిలో ఉండేదెవరో తేలేది నేడే

చైతన్యపురి: ఎల్‌బీనగర్ నియోజకవర్గం ఎన్నికల బరిలో ఉండేది ఎవరనేది నేడు (బుధవారం) తేలనుంది. నామినేషన్ల ఉపసంహరణ గడువు నేటి సాయంత్రంతో ముగియనుంది. నామినేషన్ల పరిశీలన అనంతరం మొత్తం 57 మంది అభ్యర్థులు ఉన్న విషయం తెలిసిందే. ప్రధాన పార్టీలతో పాటు ఇండిపెండెంట్లు, చిన్న చిన్న పార్టీల అభ్యర్థులు అధిక సంఖ్యలో నామినేషన్ వేశారు. నామినేషన్ వేసిన ఇండిపెండెంట్లు, చిన్న పార్టీల అభ్యర్థులను కొందరు ప్రధాన పార్టీ అభ్యర్థులు పోటీ నుంచి ఉపసంహరించుకునేలా మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. ఉపసంహరణ అనంతరం ఎల్‌బీనగర్‌లో ఎంత మంది ఎన్నికల బరిలో ఉంటారనేది

దళితుల సంక్షేమమే మోదీ ధ్యేయం

యాకుత్‌పురా బీజేపీ అభ్యర్థి వీరేందర్‌యాదవ్

చంచల్‌గూడ: ఎస్సీ వర్గీకరణకు బీజేపీ ఎల్లప్పుడూ అనుకూలంగా ఉందని ఆ పార్టీ యాకుత్‌పురా అభ్యర్థి ఎస్.వీరేందర్‌యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన మంగళవారం కుర్మగూడ డివిజన్‌లోని భరత్‌నగర్, పూలతోట, మాదన్నపేట బస్తీల్లో ఆయన పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఇతర పార్టీలకు ఓటు వేసి వృథా చేసుకోవద్దన్నారు. బీసీ అభ్యర్థిగా తనకు దళిత, బడుగు బలహీన, మైనార్టీ వర్గాల వారు మద్దతు ఇవ్వాలన్నారు.

బీఆర్ఎస్‌తోనే సుస్థిర పాలన

మలక్‌పేట అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి

సైదాబాద్: రాష్ట్రంలో సుస్థిర పాలన కేవలం బీఆర్ఎస్‌తోనే సాధ్యమని మలక్‌పేట నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి అన్నారు. మంగళవారం సైదాబాద్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి ఆధ్వర్యంలో సైదాబాద్‌లో ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఫిష్‌మార్కెట్, రెడ్డిబస్తీ, ఏకలవ్యనగర్, క్రాంతినగర్, పూసలబస్తీల్లో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ భూమేష్, మాజీ కార్పొరేటర్ తీగల సునరితారెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పగిళ్ల శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్ ఠాకూర్ పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌టీపీకి రాజీనామా

నాగోలు: వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జ్ మామిడి రామచందర్‌తో పాటు నియోజకవర్గంలోని వివిధ డివిజన్ అధ్యక్షులు ఆ పార్టీకి రాజీనామా చేశారు. త్వరలోనే తామంతా కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ చేరనున్నట్లు రామచందర్ మంగళవారం ఎల్బీనగర్‌లో విలేకరుల సమావేశంలో ప్రకటించారు. నాయకులు రమావత్ రవి, పోచబోయిన శ్రీకాంత్ యాదవ్, పడమటి కోమలి, చెన్నమ్మ, మల్లేష్, సభావత్ కృష్ణ నాయక్, బోయిన సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

తనిఖీల్లో రూ.4.56 లక్షలు స్వాధీనం

హస్తినాపురం: ఎన్నికల నేపథ్యంలో వనస్థలిపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో వాహన తనిఖీలు చేపట్టిన పోలీసులు సరైన పత్రాలు లేకుండా అక్రమంగా తరలిస్తున్న రూ.4.56 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. సీఐ జలేంధర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...వనస్థలిపురం ఠాణా పరిధిలోని రైతుబజార్ దగ్గర రంగారెడ్డి జిల్లా జిల్లెలగూడకు చెందిన ధన్‌రాజ్ చౌదరి కారు (నం.టీఎస్ 06యూబీ 5068)ను తనిఖీ చేయగా రూ.3.16 లక్షలు లభ్యమయ్యాయి. ఈ డబ్బుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో వాటిని సీజ్ చేశారు.

మరో ఘటనలో...

సహారా రోడ్డు మన్సూరాబాద్ ఎంఈ గార్డెన్స్ దగ్గర తనిఖీలు చేపట్టిన పోలీసులు కారు (టీఎస్ 03ఈఎస్ 0175) లో అక్రమంగా తరలిస్తున్న రూ.1.40 లక్షలను స్వాధీనం చేసుకున్నారు. నాగోలులో నివాసం ఉంటున్న సూర్యాపేటకు చెందిన కాసర్ల శంకర్‌రెడ్డి ఈ డబ్బును తరలిస్తున్నాడని, ఈ నగదుకు సంబంధించి ఎలాంటి ఆధారాలు చూపించకపోవడంతో సీజ్ చేశామని సీఐ వెల్లడించారు.

ఎన్నికల కార్యాలయం ప్రారంభం

చైతన్యపురి: చైతన్యపురి డివిజన్ ఇంద్రానగర్ కాలనీలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సతీమణి కమలా సుధీర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ జిన్నారం విఠల్‌రెడ్డితో కలిసి బీఆర్ఎస్ ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం పలు కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

బీజేపీతోనే ప్రజాస్వామ్య తెలంగాణ సాధ్యం



వైదేహినగర్‌లో సమావేశంలో పాల్గొన్న సామ రంగారెడ్డి, కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

- బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి

మన్సూరాబాద్/చైతన్యపురి/చంపాపేట: రాష్ట్రంలో సామాజిక న్యాయం, ప్రజాస్వామ్య తెలంగాణ బీజేపీతోనే సాధ్యమని బీజేపీ ఎల్‌బీనగర్ అభ్యర్థి సామ రంగారెడ్డి స్పష్టం చేశారు. చైతన్యపురి కార్పొరేటర్ రంగ నర్సింహ గుప్తాతో కలిసి ఆయన మంగళవారం చైతన్యపురిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ, బీజేపీకి మద్దతు పలకండి... రాష్ట్రంలో అవినీతి రహిత పాలనను అందిస్తామన్నారు. కేంద్ర నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు తానే చేపట్టినట్లు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి చెప్పుకోవటం విడ్డూరంగా ఉందన్నారు. ఎమ్మెల్యే అనుచరుల ఆగడాలు ఎల్‌బీనగర్‌లో శృతి మించిపోయాయని, నియోజకవర్గ ప్రజలు అన్ని గమనిస్తున్నారని, తగిన విధంగా ఎమ్మెల్యేకు బుద్ధి చెబుతారన్నారు. బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని వైదేహినగర్‌కాలనీలో నిర్వహించిన సమీక్ష సమావేశానికి సామ రంగారెడ్డి హాజరై ఓట్లు అభ్యర్థించారు. ఇదిలా ఉండగా, బీజేపీ అభ్యర్థి సామ రంగారెడ్డిని గెలిపించాలని కోరుతూ, మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి డివిజన్‌లోని వివేకానందనగర్, కమలానగర్, బాలాజీనగర్, విఠల్ ఎన్‌క్లేవ్ తదితర కాలనీలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంపాపేట కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి డివిజన్ పరిధిలోని మారుతినగర్, పోచమ్మగడ్డ కాలనీల్లో మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించి కమలం పువ్వు గుర్తుకు ఓటేసి సామ రంగారెడ్డిని గెలిపించాలని కోరారు.



చైతన్యపురిలో కార్పొరేటర్ నర్సింహగుప్తాతో కలిసి ఓటు అభ్యర్థిస్తున్న సామ రంగారెడ్డి

డయాబెటిస్‌పై అవగాహన కార్యక్రమం

వనస్థలిపురం: మధుమేహ దినోత్సవం సందర్భంగా శ్రీకృష్ణా డయాబెటిస్ అండ్ ఎండొక్రైన్ సెంటర్, డయాబెటిస్ కేర్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో మంగళవారం వనస్థలిపురంలో డయాబెటిస్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణా డయాబెటీస్ అండ్ ఎండొక్రైన్ సెంటర్ ఎండీ, క్రైనాలజిస్ట్ డా.నాగేందర్‌రెడ్డి పలువురికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. సమతుల్యమైన ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, బరువును అదుపులో ఉంచుకోవడం ద్వారా డయాబెటిస్ రాకుండా నివారించవచ్చని అన్నారు. యోగా, మెడిటేషన్ ద్వారా డయాబెటిస్‌ను అదుపులో ఉంచుకోవచ్చన్నారు. డయాబెటిస్‌ను ముందుగానే గుర్తించి సరైన చికిత్స పొందితే కిడ్నీ, గుండెజబ్బులు, కంటి, నరాల సమస్యలను నివారించవచ్చని అన్నారు.

క్యాట్‌లో సత్తా చాటిన శ్రీచైతన్య విద్యార్థులు

చంపాపేట: గత నెలలో ఆరు నుంచి పదో తరగతి విద్యార్థులకు దేశవ్యాప్తంగా నిర్వహించిన నాలెడ్జ్ అస్సెస్‌మెంట్ పరీక్షలో చంపాపేట, మీర్‌పేట శ్రీచైతన్య పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారని పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సురేష్ కుమార్ మాట్లాడుతూ...క్యాట్ పరీక్షలో 64 మంది విద్యార్థులు 2వ లెవల్‌కు అర్హత సాధించారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షలో అర్హత పొందిన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య పాఠశాలల జోన్ ఏజీఎం సతీష్, ఆర్ఐ రవీందర్ రెడ్డి, కోఆర్డినేటర్ రఘువంశీ, డీన్ నవీన్, పాఠశాల ఉపాధ్యాయులు ధనలక్ష్మి, పెంటు సాహెబ్, ప్రణయ్ పాల్గొన్నారు.

అనాథ విద్యార్థుల చదువుకు రూ. లక్ష విరాళం



విరాళం చెక్కును అందజేస్తున్న డాక్టర్ విజయలక్ష్మి, శ్రీనివాస్‌బాబు

దిల్‌సుఖ్‌నగర్: వనస్థలిపురంలోని విజయ నర్సింగ్ హోమ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ యు.విజయలక్ష్మి తన మాతృమూర్తి కంభంపాటి ఇందిరాదేవి పేరుపై మంగళవారం ఆర్‌కే పురం డివిజన్ చిత్రలేవుట్ కాలనీలోని అనాథ విద్యార్థి గృహానికి లక్ష రూపాయల విరాళం అందజేశారు. తాను ఇచ్చిన డబ్బును గృహంలోని అనాథ విద్యార్థుల పరీక్ష ఫీజుకు, పాఠ్యపుస్తకాల కొనుగోలుకు వినియోగించాలని గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్ ను కోరారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏసీ టెక్నీషియన్ ఆత్మహత్య

చాదర్‌ఘాట్: కుటుంబ సమస్యలతో ఏసీ టెక్నీషియన్ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చాదర్‌ఘాట్ పోలీసుల కథనం ప్రకారం... ఓల్డ్‌మలక్‌పేట పాపయ్యబస్తీలో నివసించే అబ్దుల్ షకీల్ (46) ఏసీ టెక్నీషియన్‌గా పని చేస్తున్నాడు. . కుటుంబ సమస్యలతో మనస్తాపం చెందిన అతను మంగళవారం ఉదయం ఇంట్లోని తన గదిలోకి వెళ్లి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం మార్చురీకి తరలించి చాదర్‌ఘాట్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎల్‌బీనగర్ నుంచి పోటీ నా అదృష్టం



కొత్తపేట డివిజన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్

కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్

వనస్థలిపురం: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక బీఆర్ఎస్ పార్టీ విధ్వంసం సృష్టిస్తోందని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీని ఓడగొట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ నియోజకవర్గం అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ అన్నారు. మంగళవారం నాగోల్ డివిజన్ రాక్‌టౌన్ కాలనీలో డాక్టర్ శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మధుయాష్కీ మాట్లాడుతూ, ఎల్‌బీనగర్ నియోజక వర్గం నుంచి పోటీ చేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీకి ద్రోహం చేసి పార్టీ మారిన వ్యక్తిని ఓడించాల్సిన అవసరం ఉందన్నారు. ఒకరినొకరు తిట్టుకున్న సుధీర్‌రెడ్డి, రామ్మోహన్ గౌడ్‌లు తమ స్వార్థ ప్రయోజనాల కోసం కలిసి పోయారని విమర్శించారు. ఇక బీజేపీ వాడిపోయిన పువ్వు లాంటిదని, పూజకు పనికిరాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. మహిళలకు రూ. 2500 పెన్షన్, ఉచిత బస్సు సౌకర్యం, గృహ జ్యోతి కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తామన్నారు. కార్యకర్తలు ఆరు గ్యారెంటీ పథకాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, వజీర్ ప్రకాష్‌గౌడ్, మంజులరెడ్డి, కృపాకర్‌రెడ్డి, చిరంజీవిగౌడ్, డా.సత్వీన్, శైలజరెడ్డి, టీజేఎస్ నాయకులు పల్లె వినయ్, రంగారెడ్డి, సీపీఐ నాయకులు బొడ్డుపల్లి కృష్ణ, రాముగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నాగోల్ డివిజన్‌లో జరిగిన సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్

కొత్తపేట డివిజన్‌లో..

కొత్తపేట డివిజన్‌లో రాజీవ్‌గాంధీనగర్ మసీదు నుంచి శ్రీనివాస కాలనీ, ఆర్టీసీ కాలనీ మీదుగా శివాలయం వరకు మధుయాష్కీ గౌడ్ పాదయాత్రతో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐసీసీ అధికార ప్రతినిధి షమా మహమ్మద్, జీహెచ్ఎంసీ ఫ్లోర్ లీడర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, నాయకులు వజీర్ ప్రకాష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీ డిక్లరేషన్‌తో మేలు

మహేశ్వరం కాంగ్రెస్ అభ్యర్థి కేఎల్లార్

పహాడీషరీఫ్: మైనార్టీ డిక్లరేషన్‌తో ముస్లింలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కాంగ్రెస్ పార్టీ చొరవ తీసుకుంటుందని ఆ పార్టీ మహేశ్వరం నియోజకవర్గం అభ్యర్థి కేఎల్లార్ అన్నారు. జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాంకాలనీ, జల్‌పల్లి, పహాడీషరీఫ్, షాహీన్‌నగర్, ఉస్మాన్‌నగర్, కొత్తపేట, నబీల్ కాలనీ, డ్రీమ్ సిటీ, ఎర్రకుంటలో మంగళవారం ఆయన రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అనంతరం కేఎల్లార్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ఆరు గ్యారంటీల్లో మహాలక్ష్మీ పథకం ద్వారా ప్రతి నెలా మహిళలకు రూ.2500, రూ.500లకే గ్యాస్ సిలిండర్, ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణ సదుపాయం కల్పిస్తామన్నారు. రైతు భరోసా కింద రైతులకు ఎకరానికి రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు, వరి పంటకు రూ.500లు బోనస్ ఇస్తామన్నారు. జల్‌పల్లిని అన్ని విధాల అభివృద్ధి చేస్తానన్నారు. పార్టీ నాయకులు ఉజ్మా షాకీరా, రవికుమార్, శ్రీనివాస్, యాకుబ్, అహ్మద్ బామ్, బారీ, మక్దూం పటేల్ పాల్గొన్నారు.



జల్‌పల్లిలో ఎన్నికల ప్రచారంలో కేఎల్లార్

సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి



భక్తులకు మంత్రోపదేశం చేస్తున్న సిద్ధేశ్వరానంద భారతి స్వామి

దిల్‌సుఖ్‌నగర్: సనాతన ధర్మాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని కుర్తాళం పీఠం పీఠాధిపతి జగద్గురువు సిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్‌లోని శ్రీ ప్రత్యంగిరా పరమేశ్వరి ఆలయంలో ఆయన మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు మంత్రోపదేశం చేశారు. జంట నగరాల నుంచే కాకుండా తెలంగాణాలోని వివిధ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చి మంత్రోపదేశం తీసుకున్నారు. ఆలయ సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్, కుర్తాల పీఠ పురోహితులు మాచవోలు రమేష్ శర్మ, విట్టల్ శర్మ ,హేమంత్ శర్మ, కిరణ్, శ్రీకాంత్, అరుణ, సుజాత పాల్గొన్నారు.

సందడిగా బాలల దినోత్సవం

చంపాపేట: కర్మన్‌ఘాట్‌లోని శ్రీ సరస్వతి ఉన్నత పాఠశాలలో మంగళవారం బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన విద్యావేత్త లెక్కల కృష్ణారెడ్డి చాచా నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల నిర్వాహకులు విద్యార్థులకు క్విజ్, వక్తృత్వ, వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. పాఠశాల కరస్పాండెంట్ లలితారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో...

మన్సూరాబాద్: ఎల్‌బీనగర్‌లోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల (బాలానగర్ గరల్స్-1)లో బాలల దినోత్సవ వేడుకలు కళాశాల ప్రిన్సిపాల్ వినీల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

బాలికపై లైంగిక దాడి కేసులో నిందితుడికి 20 ఏళ్ల జైలు



నిందితుడు రమావత్ చందర్

రంగారెడ్డి కోర్టులు: పెళ్లి పేరుతో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్షతోపాటు రూ.30 వేలు జరిమానా విధిస్తూ రంగారెడ్డి జిల్లా పోక్సో స్పెషల్ కోర్టు న్యాయమూర్తి హరీశ తీర్పు ఇచ్చారు. కోర్టు ఏపీపీ సునీత బర్ల కథనం ప్రకారం... యాచారం మండలం నేలవెల్లి తండాకు చెందిన నిందితుడు రమావత్ చందర్ అదే గ్రామానికి చెందిన బాలిక (13)కు ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి పలుమార్లు లైంగిక దాడికి పాల్పడాడు. విషయం బయటకు పొక్కడంతో బాలికను తల్లిదండ్రులు హైదరాబాద్‌కు పంపారు. చదువు కోసం తిరిగి స్వగ్రామానికి వెళ్లిన బాలికను నిందితుడు కిడ్నాప్ చేసి మళ్లీ లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక ఈ విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు యాచారం ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ. 30వేలు జరిమానా విధించడంతో పాటు బాధితురాలికి రూ.10 లక్షల పరిహారం ప్రకటిస్తూ తీర్పు ఇచ్చారు.

యువజన సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

- బీఆర్ఎస్ మహేశ్వరం అభ్యర్థి, మంత్రి సబితారెడ్డి



మంత్రి సబితారెడ్డి, తీగల కృష్ణారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన యువకులు

దిల్‌సుఖ్‌నగర్: తెలంగాణ ప్రభుత్వం యువత పక్షపాతని, యువజన సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నదని మహేశ్వరం బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆర్‌కేపురం డివిజన్ ఎన్‌టీఆర్ నగర్ ఫేజ్-1 కు చెందిన బీజేపీ, యువ మోర్చా నేతలు పలువురు మంత్రి సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, యువ నేత కార్తీక్ రెడ్డి సమక్షంలో మంగళవారం రాత్రి బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సబితారెడ్డి మాట్లాడుతూ, నేడు దేశంలో గత 45 ఏళ్లలో లేనంత నిరుద్యోగం పెరిగిందని, కేంద్ర ప్రభుత్వం వివిధ శాఖల్లో 16 లక్షల ఖాళీలు ఉన్నా భర్తీ చేయడం లేదని అన్నారు. రాష్ట్రంలో ఉద్యోగ భర్తీకి బీఆర్ఎస్ ప్రభుత్వం కృషి చేస్తుంటే బీజేపీ నాయకులు అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. పేపర్ లీకులలో ఎవరి మనుషులు ఉన్నారో ప్రపంచం అంతా చూసిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఒక వైపు ప్రభుత్వ రంగంలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తూనే, ప్రైవేట్ రంగంలో 24 లక్షల ఉద్యోగాలు కల్పించిందన్నారు. అక్కేనపల్లి సతీష్, సభావత్ నరేష్ , నందగిరి దినేష్, కోళ్ల కిట్టు గౌడ్, నేనావత్ మాన్ సింగ్ నాయక్, విష్ణు, అర్జున్, నితిన్, మురళి ఆధ్వర్యంలో పలువురు బీజేపీకి రాజీనామా చేసి బీఆర్ఎస్‌లో చేరారు.

ఘనంగా సదర్ వేడుకలు

నాగోలు: నాగోల్ యాదవ సంఘం అధ్యక్షుడు చింతల సాయికిరణ్ యాదవ్, చింతల శరత్ యాదవ్ ఆధ్వర్యంలో చింతల కృష్ణ యాదవ్ జ్ఞాపకార్థం నాగోలు గ్రామంలో మంగళవారం రాత్రి సదర్ సమ్మేళనం వైభవంగా నిర్వహించారు. నాగోలు పరిసర ప్రాంతాల నుంచి దున్నపోతులను తీసుకొచ్చి విన్యాసాలు చేయించారు. ఉత్సవాల్లో ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం, గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్, రాష్ట్ర టూరిజం కార్పొరేషన్ పూర్వ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా, బీజేపీ ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే అభ్యర్థి సామ రంగారెడ్డి, నాగోలు కార్పొరేటర్ చింతల సురేందర్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు ముద్దగౌని రామ్మోహన్‌గౌడ్, ఈశ్వరమ్మ యాదవ్ పాల్గొన్నారు.

పాతబస్తీలో...

చంచల్‌గూడ: దీపావళి ఉత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి చంచల్‌గూడ రోడ్డులో ఉప్పరిగూడ యాదవ సంఘం ఆధ్వర్యంలో సదర్ వేడుకలు ఘనంగా జరిగాయి. మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్, యాకుత్‌పురా బీజేపీ అభ్యర్థి వీరేందర్‌యాదవ్, యాదవ సంఘం ప్రతినిధులు సంపత్‌యాదవ్, నిరంజన్‌యాదవ్, రాంపాల్‌యాదవ్, రాజేశ్వర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.